క్లుప్తంగా

దిశ యాప్ ఆవశ్యకతను వివరించండి



మహిళా పోలీస్‌లతో సమావేశమైన ఎస్‌ఐ నాగార్జున

పగిడ్యాల: మహిళల రక్షణకు వజ్రాయుధమైన దిశ యాప్ ఆవశ్యకతను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క మహిళా పోలీస్ ఉందని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున అన్నారు. మంగళవారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. సచివాలయాల పరిధిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆండ్రాయిడ్ ఉపయోగించే మహిళల సెల్‌ఫోన్‌లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి ఆపరేటింగ్ చేసే విధానాన్ని వివరించాలని సూచించారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



జగనన్న విద్యాకానుక కిట్లతో మోడల్‌స్కూల్ విద్యార్థినులు

జూపాడుబంగ్లా: జగనన్న విద్యాకానుక చదుకోవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి భరోసా లాంటిదని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, మండ్లెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో విద్యార్థులకు పీఎంసీ చైర్మన్ శ్రీనివాసులు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు.

చేతి శుభ్రతతో డయేరియా దూరం



చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య బృందం

నందికొట్కూరు రూరల్ : మల విసర్జన తరువాత ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వలన చిన్న పిల్లల్లో డయేరియా వ్యాధిని నివారించవచ్చని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ వైద్యుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు డయేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. అన్నం తినే ముందు చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటారని వివరించారు. అనంతరం చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సుజాత, స్టాఫ్ నర్స్ గీత, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుప్రియ, ఖాజ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రాగిజావ



పిల్లలకు రాగిజావ గ్లాసును అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: రక్తహీనతతో బాధపడే విద్యార్థుల ఆరోగ్యానికి రాగిజావ దివ్య ఔషధంగా పనిచేస్తోందని మండల ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్‌లు అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నాడు–నేడు పథకం విద్యార్థులకు వరమన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ నాలుగేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపుదిద్దుకున్నాయని వివరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు తయారు చేయాలని ఆదేశించారు. విశ్రాంతి సమయంలో పిల్లలకు పంపిణీ చేసిన రాగిజావను రుచిచూశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజన కుమారి, వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పేదలకు గృహ యోగం

- పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల పంపిణీ
- ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- నియోజకవర్గంలో 72 జగనన్న లే అవుట్లు
- 5,800 మంది లబ్ధిదారులు



నందికొట్కూరు పట్టణ సమీపంలో రూపుదిద్దుకున్న జగనన్న కాలనీ

నందికొట్కూరు: ఏళ్ల తరబడి ఊరి గుడిసెల్లో..అద్దె ఇళ్లల్లో అవస్థలు పడుతున్న పేద, మధ్య తరగతి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నిరుపేదల సొంతింటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేస్తోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను చేపట్టి రూ. లక్షలు విలువజేసే స్థిరాసి వారి సొంతం అయ్యేలా ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. పూర్తి స్థాయిలో మౌలిక వసతులతో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి.

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు

సకల సౌకర్యాలతో నియోజకవర్గంలోని 72 జగనన్న కాలనీలు ఆవిర్భవించాయి. ఇందులో పేదలకు ప్రభుత్వం 5,800 పక్కా గృహాలు మంజూరు చేసింది. టీడీపీ ప్రభుత్వంలో ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ. 1.50 లక్షలు చెల్లిస్తే, జగనన్న ప్రభుత్వం రూ. 1.80 లక్షలు పక్కా గృహ నిర్మాణాలకు చెల్లించింది. కాలనీలకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తుంది. జగనన్న కాలనీల్లో మంచినీరు, రోడ్లు, విద్యుత్ సరఫరా, తదితర విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. కాగా ఇప్పటికే 2,214 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. బీఎల్–1436, ఆర్‌ఎల్–379, ఆర్‌సీ–66, ఎస్‌ఎస్–62, బీబీఎల్–1643 ఆయా నిర్మాణ దశలో ఉన్నాయి.

బిల్లులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతల్లో జమ

నియోజకవర్గంలో 4,095 జగనన్న పక్కా గృహాలకు బిల్లులు రూ.59,71,76,794లను ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. నందికొట్కూరు మండల పరిధిలోని 563 పక్కా గృహాలకు గాను 155 గృహాలు పూర్తయ్యాయి. పట్టణంలో 2,689 పక్కా గృహాలకు 2,079 పూర్తయ్యాయి. జూపాడుబంగ్లా మండల పరిధిలో 482 గృహాలకు గాను 210, కొత్తపల్లి మండల పరిధిలో 234 ఇళ్లకు గాను 09, మిడుతూరు మండల పరిధిలో 838 గృహాలకు గాను 239, పగిడ్యాల మండల పరిధిలో 656 గృహాలకు గాను 171, పాములపాడు మండల పరిధిలో 338 గృహాలకు గాను 290 పూర్తయ్యాయి.

నందికొట్కూరు నియోజకవర్గంలో పక్కా గృహాల వివరాలు

నియోజకవర్గంలో జగనన్న లే అవుట్లు	- 72
మొత్తం లబ్ధిదారులు	- 5800 మంది
పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు	-2214
ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు	- రూ. 59,71,76,794



కాలనీలో నిర్మితమైన ఇల్లు

సొంతింటి కల నెరవేరింది



ఇంతకాలం అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీశాం. జగన్ ప్రభుత్వం వచ్చాక సొంత ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు సొంత ఇంటిలో నివాసం ఎంతో ఆనందంగా ఉంది. ఎప్పటి నుంచి ఎదురుచూసిన కల నేరవేరింది. కూలీనాలి చేస్తూ జీవనం సాగిస్తున్నాం. అద్దె ఇంట్లో వేలకువేలు అద్దెతో పాటు కరెంట్ బిల్లులు ఐదారు వందలు చెల్లించే పరిస్థితి ఉండేది. కుటుంబం గడవాలంటే చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు మా ఆస్తి సుమారు రూ. 5 లక్షల వరకు ఉంటుంది. జగనన్న ఇల్లు ఇవ్వడంతో సొంతింటి బెంగ తీరింది. సొంత అన్న కన్నా ఎక్కువ మాకు జగనన్న. జగనన్నకు రుణపడి ఉంటాం. – రాజేశ్వరమ్మ కదుమూరు గ్రామం, మిడుతూరు మండలం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. సీఎం వైఎస్ జగనన్న పుణ్యమా అని ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం కూడా మంజూరైంది. 15 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నాం. నెలకు రూ 2వేలు అద్దె చెల్లించాం. రెక్కల కష్టం మీదే జీవనం సాగిస్తున్నాం. మాకు ఎలాంటి ఆస్తులు లేవు. రెక్కల కష్టమే ఆధారం. జగనన్న ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం మంజూరు చేయడంతో మేలు సొంటింటివాళ్లమయ్యాం. మాకు కొండంత బలం వచ్చింది.

– షేక్ నూర్జహాన్, నందికొట్కూరు పట్టణం

పోలీసుల బదిలీ

వెలుగోడు: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఆరుగురు పోలీసులు బదిలీపై వెళ్లినట్లు ఎస్ఐ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఏఎస్ఐలు దశరథరామిరెడ్డి, బాబు, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహులు, రామలింగారెడ్డితో పాటు ఆరుగు పోలీసులు బదిలీపై వివిధ స్టేషన్లకు వెళ్లినట్లు చెప్పారు. ఇక స్టేషన్‌లో నలుగురే సిబ్బంది ఉన్నారని, సిబ్బంది కొరత ఉన్నట్లు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే కొత్త వారిని నియమించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

బండిఆత్మకూరు తహసీల్దార్ బదిలీ

మహానంది: బండిఆత్మకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమారాణి ఆత్మకూరు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం డీటీగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ హరితకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

మహానందీ డీటీగా శ్రీనివాసులు

వెలుగోడు డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాసులును మహానంది డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మహానంది ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రీకాంతరావును కలెక్టర్ ఆఫీసుకు బదిలీ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సురేంద్రనాథరెడ్డిని మహానందికి బదిలీ చేశారు. ఈ మేరకు వారు బాధ్యతలు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

సర్వేలు త్వరగా పూర్తిచేయాలి

కొత్తపల్లి: ప్రభుత్వం చేపట్టిన ప్రతి సర్వేను సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలుసూచనలు చేశారు. మండలంలో ఆయుశ్మాన్ భారత్ సర్వే–70 డ్రాపౌట్ చిల్డ్రన్స్ సర్వే–80, వైఎస్సార్‌బీమా సర్వే –85 శాతం పూర్తి అయిందని మిగతాది త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమల స్రవంతి, పంచాయతీ కార్యదర్శి చాందిని, సచివాలయసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం



రైతుల పొలాలకు చెందిన పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో నీటిముంపు గురైన ఎర్రమఠం, సిద్ధేశ్వరం, ఎదురుపాడు, బట్టువారిపల్లి గ్రామాల రైతుల పత్రాలను పరిశీలన చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహసీల్దార్లు శ్రీరాధా, విజయలక్ష్మి, రాజారావు ఆధ్వర్యంలో పత్రాల పరిశీలన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు గతంలోనే నష్టపరిహారం అప్పటి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం సరిపోక కొంతమంది రైతులు కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఆదేశాలమేరకు కమిటీ వేసి కొత్తపల్లి మండలంలో నీటి ముంపు గ్రామాలో అర్హులైన రైతులు ఎవరు ఉన్నారు, వారి పత్రాల పరిశీలన చేస్తున్నామన్నారు. అదులో భాగంగానే ఎదురుపాడులో 208 మంది రైతులకు గాను 140 రైతుల పత్రాలు పరిశీలించామని 68 మంది రైతులు ఎక్కడ ఉన్నారో తెలియలేదని, వారు వస్తే వారిపత్రాలు పరిశీలన చేస్తామని చెప్పారు. బట్టువారిపల్లిలో 98 మంది రైతులకు గాను 78 పరిశీలన చేయగా 20 మంది రైతుల పత్రాలు పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఎర్ర మఠం, సిద్ధేశ్వరంలో 82 మంది రైతులకు గాను 25 పరిశీలన చేశామని 47 మంది రైతుల పత్రాలు చూపాల్సి ఉందని చెప్పారు. జాబితాలో పేర్లు ఉన్న రైతులు చనిపోయి ఉంటే డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొని కుటుంబ సభ్యులు రావాలన్నారు.

వలంటీర్ కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీతారామాపురం వలంటీర్ గౌతమ్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, సీతారామాపురం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ప్రభాకర్‌రెడ్డి, గోపవరం సొసైటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యం చేరుకోవాలి

మహానంది: వాహనాలు నడిపే వారు నిదానంగా వెళుతూ సురక్షితంగా గమ్యంకు చేరుకోవాలని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బోయలకుంట్ల మెట్ట వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న 15మంది వాహన దారులకు జరిమానాలు విధించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పెద్దదేవళాపురం గ్రామానికి చెందిన రవికుమార్ ఆత్మకూరులో ఉంటున్నాడు. అయితే స్వగ్రామానికి వచ్చిన ఆయన తిరిగి వెళ్తుండగా కారు ఢీకొనడంతో కాలుకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు



ఉత్తమ డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లకు బహుమతులు అందజేశారు. మంగళవారం డిపో అవరణంలో అత్యధిక కేఎంపీఎల్ (డీజిల్ పొదుపు) సాధించిన ఎస్‌ఆర్.రెడ్డి, రజాక్, అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు బాలు నాయక్, రంగస్వామి, షఫివుల్లాకు డిపో మేనేజర్ మహేంద్రుడు ప్రోత్సాహక బహుమతుల కింద చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కోటయ్య నాయక్, సిబ్బంది తిమ్మయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

వెలుగోడు: రైతులు ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూ చించారు. మంగళవారం మోతుకూరు, బోయరేవుల రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. వేసవి దుక్కులు, అపరాలు –చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేసవి దుక్కులు చేపట్టి చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని సూచించారు. సెరికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు నాగలింగం, అర్ఫర్ పాల్గొన్నారు.

భూములు ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ శామూన్‌ను కలిసిన జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన రైతుల భూములను ఆన్‌లైన్ చేయించాలని మంగళవారం జిల్లా కలెక్టర్‌ను నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన 28 మంది రైతులకు చెందిన 38 ఎకరాల భూములకు కొన్నేళ్ల క్రితం అధికారులు పట్టాలు ఇచ్చారన్నారు. వాటిని ఆన్‌లైన్ చేయలేదని, సాగుచేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా కొత్తపల్లి–సంగమేశ్వరం ప్రదాన రహదారిపై శివపురం–లింగాపురం గ్రామాల మధ్యలో ఉన్న ఎద్దులేటివాగుపై హైలెవల్ బ్రిడ్జీ నిర్మించాలని, లేకపోతే వర్షాకాలం వస్తే సుమారు 12 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, సోమల రవీంద్రారెడ్డి, నాయుడు, రైతులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీకి వలంటీర్లే సైన్యం

- కరోనా కాలంలో వలంటీర్ల సేవలు అద్వీతీయం
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, అధికారులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీకి వలంటీర్లే సైన్యమని.. కరోనా కాలంలో వలంటీర్లు చేసిన సేవలు అద్వీతీయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి పైరవీలు, అవినీతికి తావులేకుండా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు, విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు నేను సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' సంతృప్తినిచ్చింది

ఆత్మకూరు పట్టణంలో 237 మందికి సేవా మిత్రా, ఐదుగురు సేవా రత్న, మండలంలో 158 మంది సేవా మిత్రా, 13 మందికి సేవా రత్న అవార్డులకు ఎంపికయ్యారని, వలంటీర్లను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని, ప్రజల కోసమే రాజకీయంలోకి వచ్చానని, ఎవరి కోసం రాలేదని పేదల అభివృద్ధి కోసం కృషి చేయడమే తన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు సయ్యద్ మీర్, రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బాల స్వామి, సర్పంచులు నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004లో గణితం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన డాలు సాయి తిమ్మయ్య .. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా మిడుతూరు జెడ్పీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనను 2004 బ్యాచ్‌కి చెందిన పూర్వపు విద్యార్థులు మంగళవారం దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు మధు, చంద్రకాంత్, శ్రీరాములు, నాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాటిపాడులో ఉపాధి పనులు ప్రారంభించాలి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో వెంటనే ఉపాధి పనులు ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిపనులు కల్పించినా తాటిపాడు గ్రామంలో నెలరోజుల నుంచి పనులు చూపకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలో పనులు గ్రామసభలో తీర్మానం పొందినప్పటికీ సర్పంచ్ సంతకం చేయకుండా గ్రామంలో ఉపాధిపనులు లేకుండా చేయటం తగదన్నారు.

మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మృతి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిన్నిశ్రీనివాస రావు సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. అనారోగ్యంతో ఆయన కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతూ కోలుకోలేకపోయారు. ప్రాజెక్టు కాలనీలో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఎం.ఏ.రజాక్, మండల నాయకులు ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, పలువురు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికం

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందీశ్వరుడి సన్నిధిలో ఐఏటీ డైరెక్టర్

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఐపీఎ డైరెక్టర్ డాక్టర్ సోమయాజులు మంగళవారం పూజలు నిర్వహించారు. కర్నూలు జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ మోక్షేశ్వరరెడ్డితో కలిసి వచ్చిన ఆయన శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మిడుతూరు: మండల కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ, గ్రామ దేవతలు వసుదేవమ్మ, గజ్జల పాపమ్మ, రామలక్ష్మమ్మల ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూమా క్రిష్ణమోహన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం వెంకటేశ్వర్లు, దొంతు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుంకులాపరమేశ్వరికి పూజలు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో మంగళవారం సుంకులాపరమేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నూతన విగ్రహం ప్రతిష్ఠ చేసి మంగళవారం నాటికి 41 రోజులైనందున ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాయ, కర్పూరాలతో హారుతులిచ్చి నైవేద్యాలు సమర్పించారు. బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమంలో భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన బి.వెంకట నారాయణ వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం పలువురు భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వినాయక దేవనగస్తశ, శివనామమంత్రం, ఓం నమఃశివాయ, బ్రహ్మమురారి, అమ్మపరమేశ్వరి, శంభో..శివశంభో, శ్రీశైలం శివమయం మొదలైన పలు భక్తిగీతాలు, అష్టకాలను కె.చిన్నబసిరెడ్డి, కె.వెంకటప్రతాప్‌రెడ్డి, శ్రీలత, నారాయణరెడ్డి, గంగరాజు, మల్లేశ్వరి, లక్ష్మీదేవి, భారతి, ధనుంజయరెడ్డి, నారాయణమ్మ తదితరులు ఆలపించారు.